విశాలాంధ్ర

బుధవారం 26, ఏప్రిల్ 2023 | 5

పట్టణ పేదలకు ఉపాధిహామీ చట్టం అమలుచేయాలి

ప్రచార బేరిలో సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: శ్రీకాకుళం పట్టణ పేదలకు ఉపాధిహామీ చట్టం అమలుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ప్రచార భేరిలో భాగంగా 12వ రోజు మంగళవారం శ్రీకాకుళం నగరంలో తూర్పు గుమ్మాలవీధి, కుమ్మరివీధి, అరసవల్లి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక అర్బన్ ప్రాంతాల్లో పేదలు వేలాదిగా తరలివస్తున్నారని వారికి జీవనోపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కాబట్టి పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులైన ఇంటిపనివారు, షాపుల్లో పనిచేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులకోసం సమగ్ర శాసనం చేయాలని కోరారు. కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పించి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శ్రీకాకుళం నగరంలో గల పేదలు నివసిస్తున్న ప్రాంతాలన్నింటిని సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. చిన్నచిన్న కుటీర పరిశ్రమలు స్థాపించి పట్టణాల్లో ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. అరసవల్లి శివారులో గల ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కె.భాస్కరరావు, ఎస్.శ్రీనివాసులు, పి.ప్రభావతి, బి.రామారావు, జి.అప్పారావు, పి.ప్రసాద్, నారాయణ, విష్ణు, లక్ష్మీ, కొండయ్య, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

మోడీని గద్దెదించే వరకూ పోరు : సీపీఐ

పోలాకిలో : మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజలను

చైతన్యం చేయటానికి సీపీఐ పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరిలో బాగంగా మంగళవారం పోలాకి మండలంలో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు లక్కోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలోని అన్నిరంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని, పేదలను దోచి అదానీల వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపద కట్టబెట్టడమే పనిగా పెట్టుకుని సామాన్యులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్‌కు కారుచౌకగా కట్ట బెడుతున్నారని, మోడీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఆర్ ఎస్ ఎస్ భావజాలంలో దేశాన్ని కాషాయ మయం చెయ్యాలని మతాలు, కులాలు మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధిపొందుతున్నారన్నారు. మోడీ పాలనలో దేశం తిరోగమనం దిశగా పయనిస్తుందని, మోడీ పాలనను సాగణంపక పోతే భవిష్యత్ తరాలకు పెను ముప్పు అన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాల మీద ప్రజలను చైతన్యం చేసి బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మోడీ నయవంచన పాలన ను ప్రజలకు వివరించి దేశ అభివృద్ధికి, శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ ఈ ప్రచారభేరిలో పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.శ్రీనివాసూరావు, నిమ్మడ కృష్ణ భాస్కరరావు, లక్ష్మి, మెకట్, కాంతారావు, శ్రీనివాసూరావు తదితరులు పాల్గొన్నారు.

పలాసలో : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ప్రచార భేరి కార్యక్రమం జరుగుతుందని, మోడీ గద్దె దిగేదాకా ఈ పోరాటం సాగుతుందని సీపిఐ, సీపీఎం పార్టీల నాయకులు సి హెచ్ సుందర్ లాల్, ఎన్ గణపతిలు అన్నారు. ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఇందిరా కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పనంగా ఈ ప్రభుత్వం కట్ట బెడుతుందని తెలిపారు. ఏపికి ప్రత్యేక హెూదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేస్తుందని దుయ్యబట్టారు. ఉపాధి అవకాశాలు దెబ్బతీసి, సంక్షేమ పథకాలను నీరు గార్చి పేదలను మరింత పేదలుగా మార్చి, కోటీశ్వరులను శత కోటీశ్వరులు గా చేస్తూ మనుషులు మధ్య మత కల్లోలాలు సృష్టిస్తూ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతోందని తెలిపారు. ఈ విధానాలపై ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తామని వివరించారు. రాష్ట్రానికి రావలసిన రాయితీలు, హెూదా, విభజన చట్టంలోని హామీలు అమలు కోసం, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటు పరం కానివ్వకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోట్లాడాలని చూచించారు. లేని పక్షంలో ప్రజలముందు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజల ముందు దోషిగా నిలబడే పరిస్థితి వస్తుందని హితవు పలికారు. ఈ ప్రచార క్యాంపెయిన్ ఈ నెల 30 వరకు గ్రామ గ్రామాన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు సిహెచ్ వేణుగోపాల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్.రవి, బి.రమ, ఎన్.మురళి, సిహెచ్ నారాయణమ్మ, కె శ్రీను, బి.హేమలత, డి.రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థిలోకానికి కిరణ్‌చంద్ ఆదర్శం

కళ్యాణి స్కూల్ కరస్పాండెంట్ నియోజకవర్గ జనసేన నాయకులు లోల్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి: నేటి విద్యార్థులకు కిరణ్ చంద్ ఆదర్శప్రాయుడని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్, నియోజకవర్గ జనసేన నాయకులు లోల్ల రాజేష్ అన్నారు. సోంపేట పట్టణానికి చెందిన కిరణ్ చంద్ పదవ తరగతి విద్యార్థి కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ డెడ్ తో బాధపడుతూ కిరణ్ చంద్ అవయవాలను ఐదుగురికి దానం చేసి మృతి చెందాడు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచి నేటి ప్రపంచానికి ఆదర్శప్రాయుడు అయ్యాడని అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి పట్టణానికి చెందిన శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో

సంతాప సభ ఏర్పాటు చేసి విద్యార్థులందరూ ర్యాలీ చేపట్టి మానవహారంతో కిరణ్‌చంద్ ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ లోల్ల రాజేష్ మాట్లాడుతూ కిరణ్ చంద్ ప్రతి విద్యార్థికి ఆదర్శప్రాయుడని కొనియాడారు.

కిరణ్ చంద్ పేరెంట్స్ గొప్ప హృదయంతో ఆలోచించి తన బిడ్డ అవయవాలు ఐదుగురికి దానం చేసి వారి ప్రాణ రక్షణకు కిరణ్ ప్రాణాన్ని అడ్డువేశారని రాజేష్ అన్నారు. అనంతరం నియోజకవర్గ జనసేన నాయకులు లోల్ల రాజేష్ కిరణ్ చంద్ నివాసం సోంపేటలో కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

- ఆర్‌బికే యూనిట్‌గా పనిచేయాలి
- పశుసంవర్ధక శాఖ జేడీ కిషోర్

విశాలాంధ్ర-ఆమదాలవలస : పశు సంరక్షణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం కిషోర్ అన్నారు. మంగళవారం ఆముదాలవలస ఏడి కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ ఆసుపత్రి వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసి ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఇచ్చిన లక్ష్యాలపై ఒక్కొక్కటిగా సమీక్షించారు. ఆర్బికేలను యూనిట్ గా తీసుకొని లక్ష్యాల అంశాలను పూర్తిచేసిన వివరాలను నివేదించాలన్నారు. కృత్రిమ గర్భోత్పత్తికి ఇచ్చిన లేనిది అడిగారు. ఆసుపత్రి వారీగా 1950 పూర్తి చేసినట్లు వివరించారు. అలాగే నట్టల నివారణ నిర్ధారిత కేసులు ఎన్ని ఎంతవరకు వాటిని అధిగమించారనేది తెలుసుకున్నారు. ఆరోగ్యవంతమైన దూడలు ఉత్పత్తి వాటి సంరక్షణ ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు అందుబాటులో వైద్య సదుపాయం ఉండేలా చూడాలన్నారు. ఇప్పటివరకు గడ్డి విత్తనాలు ఎంతవరకు పంపిణీ చేశారు, వాటి నుండి ఉత్పత్తి అయిన గడ్డి, రైతులకు వివరించిన యాజమాన్య పద్ధతులుపై ఆరా తీశారు. పాల ఉత్పత్తిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కోలు గొర్రెలు సంరక్షణతో పాటు ఆదాయ మార్గాలైన మాంసం గుడ్లు ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను యూనిట్ గా తీసుకొని పశుగణన, ఉత్పత్తులు, నమోదైన కేసులో ట్రీట్మెంట్, వ్యాక్సినేషన్ వంటివి వాటిని పరిశీలన చేయాలని డిడి డాక్టర్ జగన్నాథం యానిమల్ హస్పంట్రీ శ్రీకాకుళం డాక్టర్ సిహెచ్ సుబ్రమణ్యం వివరించారు. అలాగే మినీ గోకులాలు ప్రస్తుతం ఉన్న వాటి స్టేజ్, ఇప్పటివరకు చెల్లించిన మొత్తాలు, ఎం బుక్ లో నమోదైన మినీ గోకులాల సంఖ్య, డీడీలు చెల్లించి తిరిగి తీసుకున్న రైతుల సంఖ్య పూర్తి వివరాలు సమగ్రంగా నివేదించాలని ఏడి డాక్టర్ రోణంకి ఆనంద్‌రావు, డాక్టర్ పిఎస్ బి.బాలకృష్ణలు పశు వైద్యాధికారులకు సూచించారు. ఇప్పటికే శాఖ పరంగా కొంతమంది రైతులు బిల్లులు చెల్లించలేదని కేసులు నమోదు చేశారని వాటిపై సమగ్ర నివేదికను అందించాలని తెలిపారు. ఈ సమీక్షలు నాలుగు మండలాల అధికారులతో పాటు పశువైద్యాధికారులు కూడా పాల్గొన్నారు.

నేతలకు దిశానిర్దేశం చేసిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం రాణా గ్రామంలో మంగళవారం ఎంపీ రామ్మోహన్ నాయుడు పర్యటించారు. ఆయన పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న టిడిపి నేతలతో సమావేశమయ్యారు. అనంతరం టిడిపి పార్టీ బలోపేతం గురించి, నేతల సమన్వయం గురించి స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. ఆయనతో పాటు తెలుగు యువత నేతలు, స్థానిక సీనియర్ టిడిపి నేతలు కూడా ఉన్నారు.

26న జలుమూరు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-జలుమూరు : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డివి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. సభ్యులందరూ నిర్దేశిత సమయానికి హాజరుకావాలని కోరారు.

పాతపనులకు కొత్త శిలాఫలకాలా?

మడ్డువలస పనుల శంకుస్థాపనపై టీడీపీ నాయకుల విమర్శలు

విశాలాంధ్ర-పొందూరు: వైసీపీ ప్రభుత్వం, వైసీపీ నాయకులు పాత పనులకు సంభందిం చిన్న శిలాఫలకాలకు కొత్త (వైసీపీ) రంగులు వేసి శంకుస్థాపనలు, ప్రారంభాలు చేస్తున్నారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, జిల్లా తెలుగుయువత ప్రధానకార్య దర్శి బలగ శంకరబాస్కర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి నాయుడులు విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం విలే ఖరులతో మాట్లాడారు. గతంలోనే నిధులు మంజూరై పనులు జరిగిన మడ్డువలస పేజ్ -2 పనులకు శంకుస్థాపన పేరుతో మంత్రులు అంబటి. -బొత్స, స్పీకర్ సీతారాంలు హడావుడి చేయడం మసిపూసి మారేడుకాయ చేసే విధంగా ఉందని అన్నారు. పనులకు పెరిగిన ధరలకు అనుగునంగా నిధులు మంజూరు చేయడం.ప్రభుత్వాల విధి అని అంతమాత్రాన పనులు ప్రారంభించి నట్లు కాదని, శంకుస్థాపనలు చేయరని అన్నారు. మండలంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో మంజూరైన తండ్యాం, లైదాం ఎత్తిపోతల పథకాలకు, పనులు ప్రారంభమైన పలు రోడ్ల పనులకు స్పీకర్ తమ్మినే ని సీతారాం తిరిగి శంకుస్థాపనలు చేయడంపై వారు విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వ సమయంలో జరిగిన అభివఅద్ధినే తమ అభివృద్ధి అని చెప్పుకోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం శంకుస్థాపనలు జరుగుతున్న పనులు ఎప్పుడు మంజూర య్యాయి. నిధులు ఏసమయంలో విడుదల అయ్యాయో మండల ప్రజలకు తెలుసని వారు అన్నారు. వీరితో పాటు మాజీ సర్పంచ్లు బి. సత్యం. జి. జగన్నాథం ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా పరిశీలించండి : గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కొసగి క్రాస్ మంత్రాలయం నియోజకవర్గం కర్నూలు జిల్లాలో మంగళవారం సర్పంచులతో సమావేశం అనంతరం లోకేష్ ని క్యాంపు దగ్గర కలిసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను పరిశీలించాలని కోరామని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపి యువ నాయకులు, జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. తన బయోడాటాని ఇచ్చి యువతకి 40 శాతం అవకాశం ఇస్తామన్న సందర్భంలో నాపేరుని శ్రీకాకుళం నియోజకవర్గానికి శాసనసభ అభ్యర్థిగా పరిశీలించి అవకాశం కల్పించమని కోరడం జరిగిందని ఆయన అన్నారు. దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారని చెప్పారు.

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెలగాం పిహెచ్ సి లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బెలగాం పి హెచ్సి వైద్యాధికారులు రాకేష్, కవిత ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ లో భాగంగా దోమల వ్యాప్తి వలన కలిగే అనర్థాలు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిహెచ్ఓ మాదిన కృష్ణారావు, హెచ్ ఈ మంగమ్మ, పీహెచ్ఎన్ రవణమ్మ,ల్యాబ్ టెక్నీషియన్ శివ ప్రసాద్, హెచ్‌విడబ్ల్యూ భారతి, యూకే సుజియ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు : ఎంపీపీ గోపి

విశాలాంధ్ర-జలుమూరు: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, అటువంటి పల్లెలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరు ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ప్రథమ స్థానంలో నిలిపిన ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులను సన్మానించారు.

రెల్లి కులస్తుల సామాజిక భవనం ప్రారంభం

విశాలాంధ్ర-పాతపట్నం: మండల కేంద్రంలోని గాంధీనగర్ (రెల్లి వీధి)లో, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ముఖ్య అతిథిగా రెల్లి కులస్తుల సామాజిక భవనాన్ని పున: ప్రారంభించారు. అనంతరం రెల్లివీధిలో నిర్వహిస్తున్న శ్రీనీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం మండల పరిషత్ వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ ఏఎంసీ చైర్మన్ కొండల అర్జున రావు మాస్టారు, జగనన్న సచివాలయ కన్వీనర్ ఏనుగుతల సూర్యం శ్రీకాకుళం జిల్లా కాపు యువజన సంఘం నేత టంకాల సుధాకర్ నీలమణి దుర్గా కమిటీసభ్యులు సవిరిగాన కృష్ణారావు, రెల్లివీధి ప్రజలు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి : స్పీకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం కొరపాం పంచాయతీ పరిధిలోని సీతన్న పేట, బుడితి పేట, సురపు నాయుడు పేట,కోరపాం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా ప్రతి గడపకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాల పట్ల ప్రజల్లో మరింత అవగాహన చైతన్యం కల్పించే విధంగా చివరి లబ్ధిదారుడికి కూడా పథకం అందుతుందా లేదా తెలుసుకొని అందని వారిని గుర్తించి పథకం అందే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఇది ప్రజల ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పార్టీలకతీతంగా పథకాల అందించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం,మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ మరియు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం

టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి

విశాలాంధ్ర-పలాస/మెళియాపుట్టి : మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరులో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి అన్నారు. మంగళవారం రేగులపాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 23వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో నిర్వాసితులు ఆఫ్‌షోర్ పనులను అడ్డుకున్న విషయం విధితమే. అందులో భాగంగానే సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో చీపురుపల్లి గ్రామంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహిస్తామని, రెవిన్యూ అధికారులు దండోరా వేయించారు. అయితే సబ్ కలెక్టర్ గ్రామ చివరి వరకు వచ్చి అక్కడ ఉన్న కొంత మంది రైతులతో మాట్లాడి ఆఫ్‌షోర్ నిర్వాసితుల విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారం రోజుల్లో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ వచ్చిన విషయాన్ని తెలుసుకొని సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ చీపురుపల్లి చేరుకొని రైతుల సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నిర్వాసితుల సమస్యలను కాలయాపన చేయడం తగదని, రైతుల డిమాండ్లను పరిష్కారం చేసిన తరువాతే పూర్తిస్థాయిలో పనులు చేపట్టేందుకు అవకాశం ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలాస, మెళియాపుట్టి తహశీల్దార్లు మధుసూధనరావు, టి.సరోజిని, సర్పంచ్ వై.ఈశ్వరరావు, రైతు సంఘ నాయకులు చాపర సోమేశ్వరరావు, అంబలి లక్ష్మణరావు, జి.బుజ్జి, జోగారావు, బెనర్జీ, సోమేష్‌లు పాల్గొన్నారు.

నాణ్యత పరిశీలించాకే బిల్లులు చెల్లిస్తాం

క్వాలిటీ కంట్రోల్ ఎస్.ఇ ఆర్.శ్రీనివాసమూర్తి

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ ఎల్.సి గేటు వద్ద శరవేగంగా నిర్మాణం జరుగుతున్న పలాస రైల్వే ఫ్లై ఓవరు వంతెన నిర్మాణ పనుల నాణ్యతలను పరిశీలించాకే గుత్తేదారులకు బిల్లు చెల్లించడం జరుగుతుందని, క్వాలిటీ కంట్రోల్ (విజయవాడ) ఎస్.ఇ ఆర్.శ్రీనివాస మూర్తి అన్నారు. మంగళవారం రైల్వే ఫ్లై ఓవరు వంతెన పనులను పరిశీలించి పనులు చేస్తున్న కార్మికులకు పలు సూచనలు చేశారు. నిర్మాణం జరిగిన పనులకు కొలతలను ఆర్.అండ్.బి అధికారులతో తీసుకున్నారు. వంతెన ఎంత వెడల్పు ఉంది. నిబంధనలకు అనుగుణంగా స్తంభాలను నిర్మించారా.. లేదా.. తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు డి.ఇ రామచంద్రరావు, జె.ఇ శ్రీనివాసరావు, ఎ.ఇ జగదీష్, ఆర్.అండ్.బి. ఇ.ఇ సత్యన్నారాయణ, డి.ఇ రామనాయుడు, జె.ఇ విక్రమ్‌లు ఉన్నారు.

ప్రతీ ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రతీ ఒక్కరూ తమకు తోచిన సహాయాన్ని ఇతరులకు చేయటం అలవరచుకోవాలని వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ కోరారు. స్థానిక సూర్యమహల్ కూడలివద్ద ప్రజల దాహార్తి కోసం న్యూ బ్లడ్ బ్యాంకు శ్రీకాకుళం, జిల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన మజ్జిక చలివేంద్రాన్ని మంగళవారం ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం పాదచారులకు సుమారు 600 మజ్జిగ ప్యాకెట్లను అందజేసి మాట్లాడుతూ సేవ చెయ్యాలనే ఆలోచన మహా గొప్పదని, ఎండలు ఎక్కువగా ఉన్నందున చలివేంద్రాలు అవసరమని, ప్రజలకు సేవ చెయ్యటం ఒక వరమని, ఇందులో బాగమవ్వటం నిజంగా నా అదృష్టమన్నారు. ఈ సందర్భంగా న్యూబ్లడ్ బ్యాంకు శ్రీకాకుళం, జిల్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు సభ్యులు డా. మణికంఠ, ఉమా శంకర్, శ్రీ ఫౌండేషన్ శ్రీకాంత్, సతీష్, జిల్ ఫౌండేషన్ సభ్యులు సత్య సాయి, సాయి, శివ, సంతోష్, జేసీ ఐ గ్రీన్ సిటీ మణిశర్మ, వీరభద్ర, సామాజిక కార్యకర్త చిన్నారి ట్వింకిలు పాల్గొన్నారు.

'పల్లె ప్రగతికోసం మీలోకేష్' కార్యక్రమంలో వెంకట భానోజీనాయుడు

విశాలాంధ్ర-రణస్థలం: కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువ గళం కార్యక్రమంలో పల్లె ప్రగతి కోసం మీ లోకేష్ కార్యక్రమంలో రణస్థలం సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన రాష్ట్రంలో పల్లెల సేవలే పరమేశ్వరుని సేవగా భావించి ప్రభుత్వం నుంచి పంచాయితీలకు ఎటువంటి నిదులు రాకపోయినా మీరు చేపడుతున్న సేవలు మరువలేనివని కొనియాడారు. శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలిచిన, సేవాపథంలో దూసుకుపోతున్న పిన్నింటి వెంకట బానోజీ నాయుడుని నారా లోకేష్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పంచాయితీలకు పూర్వ వైభవం తీసుకువస్తానని మాట ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు గోండు శంకర్, ఎంపీటీసీ మజ్జి వెంకటరమణ రాష్ట్ర కమిటీ సభ్యులు, పైడి బీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, అన్నిపు రామకృష్ణ, మధుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు పాల్గొన్నారు.

గురండి పంచాయతీకి అవార్డుల పంట

- వివిధ విభాగాల్లో 9 అవార్డులు

- పొన్నుటూరు, గుణభద్ర, పారపురం, ఒంద్రుకొల పంచాయతీలకు ఒకో అవార్డ్

విశాలాంధ్ర-కొత్తూరు : జాతీయ పంచాయితీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పర్సకటించిన మెరిట్ అవార్డ్‌ల్లో మండలం గురండి పంచాయతీకి తొమ్మిది అవార్డ లు లభించాయి పేదరికం నుండి ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, బాలల మైత్రి, సరిపడే త్రాగునీరు, క్లీన్%ఁ% గ్రీన్, స్వయం సంవృద్ధి, సామాజిక భద్రత, గుడ్ గవర్నెన్స్, మహిళా సాధికారత ఈ తొమ్మిది విభాగాల్లో గురండి పంచాయతీకి ఈ అవార్డులు దక్కాయి. గురండి పంచాయతీ సర్పంచ్‌గా యువకులు బోర సింహాద్రనాయుడు అధికారంలోకొచ్చి గత రెండున్నర ఏళ్లుగా తన పంచాయతీని చాలావరకు అభివృద్ధి చేశారు. కాగా ఈ సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ సింహా ద్రినాయుడును ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ నాయుడు, ఇఓపీఆర్డీ కృష్ణారావు ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. తోటి సర్పంచ్‌లు కూడా కొందరు ఈ కార్యక్రమానికి హాజ ఒక్కో అవార్డ్ సాధించిన పొన్నుటూరు, గుణభద్ర, పారపురం, ఒంద్రుకొల గుణభద్ర ఆర్‌ఆర్ పంచాయతీ సర్పంచ్‌లను కూడా ఈసందర్భంగా సన్మానించి అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ పావని, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్, వైసీపీ నాయుకులు వేంకట కృష్ణ, ఎద్దు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపట్ల అవగాహన కలిగి ఉండాలి

డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ బి మీనాక్షి



విశాలాంధ్ర-శ్రీకాకుళం:మలేరియా పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ బి మీనాక్షి సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి నిర్వహించిన ర్యాలీలో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ దోమ కాటు లేనిదే మలేరియారాదని, చలి, వణుకు, విపరీతమైన జ్వరం ఉంటాయని అన్నారు. మలేరియా లక్షణాలు ఉన్నవాళ్లు నెలల తరబడి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ, ఉంటార న్నారు. తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుంటే కొంతవరకైనా మలేరియా నుండి దూరంగా ఉండవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సకాలంలో పరీక్షలు నిర్వహించుకుని మందులు వాడాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఆషా, ఆరోగ్యకార్యకర్తలు వ్యాధిని, నిర్ధారించేందుకు ఇప్పటికే రాపిడ్ దయాగ్నస్టిక్ కిట్లును సరఫరాచేసామని తెలిపారు. దోమతెరలు వాడాలని, ఇళ్లలో క్రిమి సంహారిక మందు పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే దోమల నివారణకు తీసుకోవల్సిన జాగ్రతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్య అధికారిణి డా. అనురాధ, డా.జె.కృష్ణ మోహన్, డి.ఐ.ఓ. డాక్టర్ ఆర్.వి.ఎస్.కుమార్, జిల్లా మలేరియా అధికారి సత్యన్నారాయణ, సబ్జెక్టు అధికారి సూర్యం జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మంత్రి వెంకటస్వామి, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, మురళీ, సాయి, ఎఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పోలాకి మండలంలో వివిధ విభాగాల్లో 2022బి 2023 సంవత్సరానికి గాను ఉత్తమ సేవలు అందించిన సర్పంచులకు మండల పరిషత్ ప్రతినిధి శ్రీ ముద్దాడ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.. ఎంపిక చేసిన కొన్ని పంచాయితీలకు గాను మండలంలోని సంతలక్ష్మీపురం గ్రామ పంచాయతీకి సంబంధించి మంచినీటి సమృద్ధి, సామాజిక భద్రత అంశాల్లో మంచి పనితీరు సాధించినందుకు ప్రథమ ద్వితీయ బహుమతులును సర్పంచ్ యారబాటి నేలవేణి ,కార్యదర్శి చింతాడ ఉమామహేష్ లకు ఇస్తూ. దుస్సాలు వాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు.. ఈ విషయమై తమ పంచాయితీ ప్రథమ ద్వితీయ బహుమతులకు ఎంపికైనందుకు పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి డా.సీదిరి సెల్ఫీ చాలెంజ్‌ను స్వీకరిస్తున్నాం

టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు లేఖ

విశాలాంధ్ర-మందస : పలాస నియోజకవర్గం అభివృద్ధిపై రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సెల్ఫీ చాలెంజ్ చేశారని, దానిని తెలుగుదేశం పార్టీ తరుపున స్వీకరిస్తున్నామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు యాదవ్ సవాల్ విసిరారు. ఈమేరకు మంగళవారం బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకొర పనులతో ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియని కిడ్నీ పరిశోధన కేంద్రం తప్పితే చెప్పుకోవడానికి ఇంకేమీ లేదేమో అని అన్నారు. ఉద్దాన ప్రజల జీవనాధార పంట జీడి పిక్కలకు కనీస మద్దతు ధర లేక విలవిలలాడుతున్న జీడి రైతుల కష్టాలు, కన్నీళ్ల దగ్గర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సెల్ఫీ తీసుకుంటే బాగుంటుందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 80కేజీల జీడిపిక్కల బస్తా 14వేల రూపాయలుంటే నేడు అదే జీడిపిక్కల బస్తా 8వేల రూపాయలు కూడా కొనే నాధుడు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. గత ఏడాది జీడి రైతులకు, ప్రజాసంఘాల నాయకులకు కనీస జీవో లేకుండా 80కేజీల బస్తా 9వేల రూపాయలకు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం 1000 రూపాయలు మద్దతు ధర ప్రకటిస్తుందని నమ్మించి నట్టేట ముంచిన సంగతి ఈ ప్రాంత రైతులు ఇంకా మర్చిపోలేదని అన్నారుల. ఈ ప్రాంతం మీద మంత్రిగారికి ప్రేమముంటే అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన 3వేల కోట్ల రూపాయలు ధరల స్థిరీకరణ నిధుల నుంచి కేటాయించి పలాస నియోజకవర్గం ప్రాంతంలో పండించిన జీడిపిక్కలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా 80కేజీల బస్తా 16వేల రూపాయలకు ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి అప్పుడు సెల్ఫీ తీసుకుంటే సంతోషిస్తామని అన్నారు. గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి కోసం అనాడు తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) పలాస నియోజకవర్గం మందస నుంచి మన్యం జిల్లాలో కలపడం వలన వారం వారం ఈ ప్రాంత గిరిజనులు వారి సమస్యలను చెప్పుకునేందుకు చెప్పుకునేందుకు గిరిజన దర్బారు, ఐటిడిఏ లేని మందసలో మంత్రి సెల్ఫీ తీసుకుంటే ఆయన చేసే అభివృద్ధి తెలుస్తుందని అన్నారు. పర్యావరణ అనుమతులు, మైనింగ్ అనుమతులు లేకుండా పచ్చని నల్లబొడ్లూరు కొండను మాయం చేసి యాదేచ్ఛగా గ్రావెల్ దోపిడి చేసిన వైసీపీ నాయకులతో ఆ ప్రాంతంలో సెల్ఫీ తీసుకుంటే ఇంకా బాగుంటుందని ఎద్దేవా చేశారు. మూడేళ్లుగా జీతాలు రాని ఉద్దాన మంచినీటి ప్రాజెక్టు కార్మికుల కన్నీరు కనబడవా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు శుద్ధజలం అందించి నేడు బోసిపోయిన ప్లాట్ల వద్ద, నెఫ్రాలజిస్టు లేని డయాలసిస్ కేంద్రం వద్ద పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కాలువ వ్యవస్థ వద్ద సెల్ఫీలు తీసుకుంటే నియోజకవర్గ ప్రజలందరు తిలకిస్తారని అన్నారు. తమకు కావాల్సింది సెల్ఫీలు కాదని, ఈ ప్రాంత జీవన ప్రమాణాలు పెంచే మానవీయ అభివృద్ధి కావాలని, ఆ దిశగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అడుగులు వేయాలని సూచించారు.

చింతామణి అమ్మవారిని దర్శించుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-కవిటి : ఉద్దాన ప్రాంత ప్రజల ఇలవేల్పు చింతామణి అమ్మవారిని సబ్ ఇన్స్పెక్టర్ మురళి మంగళవారం దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గతంలో కవిటి పోలీస్ స్టేషన్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు చేపట్టిన మురళితో పాటు కుటుంబ సభ్యులను చింతామణి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఘనంగా శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్,మాజీ సర్పంచ్ ఆరంగి మధు, గొండ్యాల భాస్కరరావు, జోగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

విశాలాంధ్ర-పలాస: విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన డిమాండ్ చేశారు. మంగళవారం కాశీబుగ్గలో 137వ మేడే గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘిటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్, విద్యుత్, బస్ చార్జీలతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను కట్టడి చేయాలని కోరారు. రాష్ట్రంలో మూతపడ్డ సిమ్మెంట్ ప్యాక్టరీలు, జ్యూట్ మిల్లులు తక్షణమే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్రంలో జీవో ఆర్.టి నెం.1ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా కార్లమార్క్స్ జయంతి వేడుకలను మే 1 నుంచి 5వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవాడ నారాయణమూర్తి, కారి పురుషోత్తం, మురిపిండి రాజారావు, కె.లోకనాథం, వై.జోగారావు, మద్దిల ధర్మారావు, పి.హరిక్రిష్ణలు పాల్గొన్నారు.

షిరిడిసాయి వార్షికోత్సవంలో బాబాయ్, అబ్బాయి

విశాలాంధ్ర-టెక్కలి : మండలం కొనుసులు కొత్తూరులో షిర్డీ సాయి బాబా మందిరం 11వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్నా యుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ షిర్డీబాబా మందిరాన్ని బారికి రెడ్డి, రత్నాలమ్మ నిర్మించారని గుర్తు చేశారు. అయితే మందిరానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం టీడీపీ నేత, కేంద్ర మాజీమంత్రి ఎర్రన్నాయుడు చేతులమీదుగా జరిగిందన్నారు. మందిరం నిర్మాణం తర్వాతే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. 2024లో మందిరానికి పుష్కరోత్సవం జరుగుతుందనీ, ఆ పుష్కరంలో రాక్షస రాజ్యాన్ని పారదోలి, రామరాజ్యం ఏర్పాటు కానుందన్నారు. ఆ రామరాజ్యంలో ఈ గ్రామానికి మరెంతో అభివృద్ధి జరుగుతుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా మహాన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులతో పాటు టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా నెమలికొండ ఆశ్రమ పీఠాధిపతి సద్గురు సదానంద సరస్వతి నుంచి ఎంపీ రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుడు ఆశీస్సులు తీసుకున్నారు.

భారీఎత్తున శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శక్తిని ముక్తిని ప్రసాదించే ఇలవేల్పుగా కొలవబడే శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలను భారీఎత్తున నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ స్థానికుల సహకారంతో ప్రతీ రోజు అమ్మవారి తిరువీధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. రోజుకో ప్రాంతంలో అమ్మవారి ఊరేగింపును కాళిక, కోయ నృత్యాలు, గరిడీ, కోలాటం తదితరాలతో సాగిస్తున్నారు. అమ్మవారిపై నమ్మకంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఉదయం నుండి మండపం వద్ద పూజలు జరుపుకుంటూ ఊరేగింపులో దర్శనానికి బారులు తీరుతున్నారు. సోమవారం దినవారి మార్కెట్ వ్యాపారులు అమ్మవారికి ఆదరించి సాంప్రదాయ బద్దంగా పూజాధికాలు జరిపి భోగాలు సమర్పించుకున్న అనంతరం మార్కెట్ వద్ద నుండి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు గోర్జీవీధి, రథంవీధి, జగన్నాథ స్వామి కోవెల వీధి, చిన్నాకుల వీధి, ఆసుపత్రి రోడ్డు, చంద్రానగర్, దానంపేట, కార్జీవీధి, పంజావీధి, బ్రాహ్మణవీధి, పెద్దాకుల వీధి తదితర పద్నాలుగు వీధుల్లో సాగి నర్మదేశ్వరాలయం మార్గం ద్వారా తిరిగి అర్ధరాత్రి సమయానికి ఉత్సవ మండపానికి చేరుకుంది. ఊరేగింపు నిర్వాహణ తీరుపై ఎక్కడికక్కడ ప్రజలు విమర్శిస్తున్నా పద్ధతులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా అవేమీ పట్టనట్లు అమ్మవారిని నడిపే తీరు పై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో చోట ఒక్కోలా వ్యవహారాలు సాగుతున్నాయని, ఒక్కో వీధిలో ఒక్కోలా అమ్మవారి వెంట నడిచే నాటకాలను ప్రదర్శిస్తున్నారన్న అసంతృప్తి వ్యక్తం అవుతుంది. చందాలు అన్ని ప్రాంతాల్లో ఒకేలా వసూలు చేసి, తారతమ్యాలు చూపడం భావ్యం కాదనేది ప్రజల భావన. అమ్మవారి కమిటీ ప్రతినిధులుగా చలామణి అయ్యే వారు, వారి సన్నిహితులు ఇళ్ళ వద్ద ఒకలా మరో చోట మరోలా సమయాన్ని వ్యచ్ఛించడమేమిటని మహిళలు చర్చించుకుంటున్నారు. దశాబ్దాల తర్వాత గ్రామంలో ఊరేగుతున్న అమ్మవారిని మనసార పూజించి దర్శించుకోలేని వైనానికి మదనపడుతున్నారు. ఇదివరకే ప్రారంభంలో ప్రకటించిన రూట్ మ్యాప్ అనుసారంగా ఊరేగింపు సాగక, సమయాభావం వల్ల కొన్ని వీధులు విడిచి మరుసటి రోజుల్లో ఊరేగింపు సాగింది. దాంతో రాత్రి 11.30గంటల వరకూ అమ్మవారిని కాళ్ళు కడిగి ఆశీర్వాదం తీసుకుందామనుకున్న భక్తులు తీవ్ర అసహనానికి గురయ్యారు. అమ్మవారిని తిరిగి ఉత్సవ మండపానికి చేర్చే సమయం ముగుస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయాలుగా ఉత్సవాలు నిర్వహించే ప్రతినిధులు తెలియజేస్తున్నారు. వీధుల్లో చందాలు సేకరించిన వారికంటే ఇతరాత్ర వ్యక్తులే అమ్మవారి తిరువీధి కార్యక్రమంలో హాల్ చల్ చేస్తుండటం కూడా చర్చనీయాంశమవుతుంది. ఎక్కువ వీధుల్లో ఒకే రోజు ఊరేగింపు వల్ల అటు కాళిక, కోయ నృత్యాలు చేసే వారితో పాటు ఇతర కళాకారులకు ఇబ్బందులతో పాటు, అమ్మవారి సంబరాల జాతర ఉత్సాహాన్ని ఆస్వాదించాలని ఆహారం తీసుకోకుండా వేయి కళ్ళతో ఎదురు చూసే చిన్నారులు, వృద్ధులు తదితర ప్రజలు కూడా నిరుత్సాహానికి గురవుతున్నారు.

సీఎం జగన్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-హిరమండలం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయమై ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ కార్యాచరణ ప్రారంభించినందుకు కృతజ్ఞతగా హిరమండలం పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ మీసాల షణ్ముఖ రావుతోపాటు కాంట్రాక్ట్ సిబ్బంది, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా కాంట్రాక్టు ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యలైన జీవో నెంబర్ 27 సవరణ చేయడానికి రాష్ట్ర మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టమైనహామీ ఇచ్చినందున వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ కృతజ్ఞత తెలియజేశారు.

ఎండల వారాల్లో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పెరుగుతున్న ఎండలను తగ్గించి మానవ జాతితో పాటు పశుసంపదలను కాపాడాలని గ్రామదేవతలను పూజిస్తూ ప్రతి యేదాది ఏప్రిల్ చివరి మంగళవారం గ్రామస్థులు పల్లెల్లో గ్రామదేవతలకు చల్లధనం కోసం ఎండలవారాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా మండలంలోగల నిమ్మాడ గ్రామంలో తన బాబాయి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, గ్రామస్థులతో కలిసి శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన కుటుంబసభ్యులతో కలిసి గ్రామ దేవతలైన పాతపట్నం అమ్మవారు, నీలమ్మతల్లి, అసిరితల్లి అమ్మవారులను ముర్రాటలతో వెళ్ళి చల్లధనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ తల్లి కింజరాపు విజయమ్మ, టీడీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు మెండ దాలినాయుడు, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మళ్ళీ సీఎం జగనన్నే : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హిరమండలం: జై సీఎం జగనన్న మళ్ళీ మీరే ఏపీ సీఎం జగనన్న అంటూ పాతపట్నం నియోజకవర్గఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకులు, వైస్సార్సీపీ కార్యకర్తలు ప్రజలు తో కలసి మండలం లోని గొట్టా లక్ష్మి పురం, లోకొండ గ్రామాల్లో మంగళవారం సాయింత్రం మా నమ్మకం మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి ప్రజలతో మమేకం అయి సీఎం జగన్ పాలన ఎలా ఉందని ప్రజలు బాగోగులు అడిగి తెలుసు కున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ మంచి పాలన సాగిస్తున్న సీఎం జగనన్న ను మళ్ళీ సీఎం ను చేసి ఋణం తీర్చుకోవాలని అభ్యర్థించారు. రాష్ట్ర అభివృద్ధి ఇంతలా చేసే సీఎం ను ప్రజలు అంతా కోరుకుంటున్నారని ఈసందర్భంగా తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మండలవైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, జగనన్న సచివాలయ మండల కన్వీనర్ ఎవి సురేష్, సర్పంచ్లు వంజరాపు జ్యోతి, వి చిరంజీవి, మీసాల శంకర్ రావు, మీసాల రామారావు, జి సుదీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రలో ఈనాడుకు ప్రత్యేక స్థానం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆంధ్ర రాష్ట్రంలో ఈనాడు పత్రికకి ప్రత్యేక స్థానం ఆంధ్ర ప్రజానీకం ఇవ్వడానికి కారణం ఆ పత్రిక పై ప్రజలకు ఉన్న విశ్వసనీయత అనేది ప్రజానీకానికి తెలుసు అని శ్రీకాకుళం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి తెలియజేశారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రలో ఈనాడు పత్రికను ప్రత్యేక స్థానం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతికా స్వాతంత్రాన్ని ప్రభుత్వాలు కాపాడవలసి ఉందే తప్ప ప్రభుత్వం ఇతరత్రా మార్గాలను అన్వేసించి పత్రికలపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నం చేయడం పత్రిక స్వేచ్ఛను దెబ్బతీయడమే అని తెలియజేశారు. గతంలో ఈనాడు వ్యవస్థాపకులు రామోజీరావు పై ఒత్తిడి తేవడానికి రామోజీ స్టూడియోస్ పై జరిగిన దాడులు మరువక ముందే ప్రస్తుతం మార్గదర్శిపై జరుగుతున్న దాడులు ఈనాడు పై ఒత్తిడి కోసం ఏ విధంగా జరుగుతున్నాయో అందరికీ తెలుసునని, ముఖ్యంగా లబ్ధిదారుల నుంచి ఆరోపణలు రాకుండా సక్రమంగా జరుగుతున్న విధానం తూట్లు పొడవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయడం సరైన చర్య కాదన్నారు. ప్రభుత్వం ఈ చర్యలను విరమించుకుంటే మార్గదర్శి లబ్ధిదారులు, ప్రజలు సంతోషిస్తారని తెలియజేశారు.

దోమల నుంచి వచ్చే వ్యాధులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-జలుమూరు: దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, దోమ కాటు ప్రమాదకరం దానివలన మలేరియా డెంగ్యూ వ్యాధులు రావచ్చునని డాక్టర్ టి. శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జలుమూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా లక్షణాలు వివ రించారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన చలి జ్వరము, చెమటలు ,తలనొప్పి, వంటి నొప్పులు, రక్తహీనత ఉంటుందన్నారు. కనుక దోమల నివారణకు టైర్లు, కొబ్బరి బొండాలు, మరియు పనికిరాని వస్తువులలో నీరు నిలవ లేకుండా చూడాలన్నారు. వాడని కూలర్ లలో నిల్వ ఉన్న నీటిని తీసివేయలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులలో, పంపులలో దోమలు చేరకుండా మూతలు పెట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డ్రేగా పాటించాలని, అనగా నీటి నిల్వలకు వాడే డ్రమ్ములు ఖాళీ చేసి శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టి ఉంచాలన్నారు. రాత్రిపూట నిద్రించేటప్పుడు దోమల తెరలు ఉపయోగించాలనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. సీహెచ్. వంశీకృష్ణ, ఎస్. పద్మవతి, యు. చిన్నరాజులు, హెచ్‌వీ కె. లలితాంబ, ఎల్‌టీ ఎం. రాజారావు, ఏఎన్‌ఎంలు, ఆశ, తదితరులు ఉన్నారు.

ప్రశ్నిస్తే కేసులా... ? ఇదేమి ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, దాడులు చేయటం వైఎస్సార్‌సీపీ నాయకులకు షరా మామూలు అయిందని ఇదేమిఖర్మ రాష్ట్రానికి అంటూ మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు తర్ర రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. మండలంలోగల నారాయణవలస పంచాయతీలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రతి ఇంటి వద్ద టీడిపి నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను క్రూడీకరించారు. సేకరించిన సమస్యలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ అధికారులకు తెలియజేస్తామని వారు స్పందించకపోతే పోరాటాలు చేస్తామన్నారు. రైతులకు రాయితీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా ఆపివేశారన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రానికి పట్టిన వైసీపీ కర్మను ఓటు అనే ఆయుధంతో తొలగించాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ పార్టీ మహిళ అధ్యక్షురాలు పూజారి శైలజసత్యన్నారాయణ, టీడీపీ నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ, బాడాన రమణమ్మ, గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాసరావు, కోరాడ గోవిందరావు, మక్క లక్ష్మణరావు , ఎస్. రాంకుమార్, చిన్న గోవింద, బోయిన సత్యశ్రీనివాస్, తంగుడు సునీల్, హనుమంతు అప్పలరాజు, దుంపల నర్సింహమూర్తి, దుప్పల జయరాం, దుంపల జగన్నాథరావు, కింజరాపు యువసేన, కోట సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లు ధరించి ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏ.పి.జె.ఏ.సి అమరావతి మలి దశ ఉద్యమ కార్యాచరణ లో భాగంగా మంగళవారం ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు శ్రీకాకుళం జిల్లా ఏపీ జేఏసీ అమరావతి, అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల రిబ్బనులు ధరించి నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద గల రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏపీ జేఏసీ అమరావతి నాయకులు, ఏపీ ఆర్ఎస్ఏ నాయకులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ యూనిటీ టీమ్, సీటు నాయకులు, పెన్షనర్స్ సంఘం నాయకులు పెద్దయెత్తున పాల్గొని 50 రకాల డిమాండ్లను పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అలాగే సీటు నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కండి అని నినాదం తో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏపీ జేఏసీ, అమరావతి శ్రీకాకుళం జిల్లా అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణ రావు, జనరల్ సెక్రెటరీ యెస్.వి.రమణ, మహిళ శాఖ చైర్మన్ ప్రవల్లిక ప్రియ, ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మురళీధర్ నాయక్, కోశాధికారి జి.ఎల్.ఇ. శ్రీనివాసరావు, శ్రీకాకుళం యూనిట్ కార్యదర్శి డి.ప్రకాష్ రావు, అసోసియేట్ అధ్యక్షులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు పి.ఎన్.నాయుడు, బోస్ మన్మథరావు, ఆర్ట్ మరియు క్రాఫ్ట్ యూనిటీ ప్రెసిడెంట్ వై.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఎల్.దిలీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.కామేశ్వర రావు, సీఐటీయు నాయకులు పి.తేజశ్వర రావు, అల్లు సత్యనారాయణ, క్. సూరయ్య పెన్షనర్ సంఘం నాయకులు ఎం.ఆదినారాయణ మూర్తి వీఆర్వోల సంఘనాయకులు, వీఆర్ఏల సంఘ నాయకులు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రపంచ మలేరియా దినోత్సవం లో డాక్టర్ శ్రీధర్



విశాలాంధ్ర-పాతపట్నం : వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ప్రపంచం మలేరియాకార్యక్రమంలో బైదలాపురం పి. హెచ్.సి వైద్యులు డాక్టర్ ఐ శ్రీధర్ అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం సందర్భంగా బైదలాపురం పి. హెచ్.సి వారి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పి. హెచ్.సి ఉద్యోగులతో అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నుండి రక్షించుకునేందుకు దోమతెరలు ఉపయోగించాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్.సి వైద్య సిబ్బంది, గ్రామస్తులుపాల్గొన్నారు.

పేదల పాలిట వరం అన్న క్యాంటీన్... 6వ రోజు కొనసాగింపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్ పేదలకు వరం లాంటిదని నియోజకవర్గ మహిళా కార్యదర్శి గొండు స్వాతిశంకర్ అన్నారు. టీడీపీ యువనాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నాక్యాంటీన్ మంగళవారం ఆరో రోజు కొనసాగించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ మహిళా కార్యదర్శి గొండు స్వాతిశంకర్ పాల్గొని పేదలకు భోజనం అందించారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మి రాజ్యం, గార మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి, రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి కంచు దశరథ, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు రెడ్డి శంకర్, వైస్ ప్రెసిడెంట్ కుంచాల అదినారాయణ,మాజీ ఎఎంసీ డైరెక్టర్ ఎందు రామారావు, మాజీ ఎంపిటిసి ఎందు అమ్మన్న రావు, మాజీ ఎంపిటిసి మట్ట ఆనంద్, పేట పద్మా రుప్ప భాస్కర్, ధర్మాన తాతారావు, వార్డు మెంబర్ వనుము అసిరినాయుడు, పట్టనాన మహేష్ , ఇంటి శంకర్, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆఫ్ షోర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం చీపురుపల్లి గ్రామాన్ని సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. గతంలో నిర్వాసితుల సమస్యలు ఎన్ని మార్లు ఎంతమంది అధికారులకు తెలియజేసిన నేటికీ కొన్ని సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని ఆర్‌ఆర్ ప్యాకేజీ, యూత్ ప్యాకేజీ, హౌస్ సైట్ పట్టాలు అందక చాలా మంది నిర్వాసితులు సతమతమవుతూ ఇబ్బం దులు ఎదుర్కొంటున్నామని, అలాగే గతంలో చేసిన సర్వేలో తప్పిపోయిన వారు సైతం ఉన్నారని తదితర సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకుని వచ్చారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌ఆర్ ప్యాకేజీ, హౌస్ సైట్ పట్టా తదితరు ఏ సమస్యలున్న వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలియ జేస్తూనే, సర్వేలో తప్పిపోయినటువంటి వారు ఎవరైతే ఉన్నారో వారందరినీ గుర్తించి గ్రామానికి సంబంధించిన ఓ ఐదుగురు వ్యక్తులు వచ్చినట్ల యితే జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తాన న్నారు. నిర్వాసితులకు సంబంధించి నటువంటి ఏ సమస్యనైనా వాటి పరిష్కారానికి పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. జరగవలసిన పనులకు సంబంధించి నిర్వాసితుల సైతం ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అంతకు ముందు రేగులపాడు గ్రామాన్ని సైతం సందర్శించారు. సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నిర్వాసితులు, చీపురుపల్లి గ్రామస్తులు, యువ కులు, మహిళలు, తదితరులున్నారు.

అభివృద్ధి లక్ష్యంగా చర్యలు : ఎంపీపీ దేవదాసు రెడ్డి

విశాలాంధ్ర-కవిటి: కంచిలి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయం తాగునీరు రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. అలాగే అర్హులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను చేరేటట్లు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీల్లో మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సర్పంచ్లను గుర్తించి వారిని గౌరవించడం మంచి పరిణామం అన్నారు. అందరూ జగన్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. కిడ్నీ ప్రభావిత ఉద్దన గ్రామాలకు తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పెద్ద శ్రీరాంపురం ఎంపీటీసీ మాదిన విమల కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమ శాఖల పనితీరు ప్రగతి గురించి తెలియజేశారు కార్యక్రమంలో ఎంపీడీవో చల్ల శ్రీనివాసరెడ్డి, తాసిల్దార్ హైమావతి, ప్రత్యేక ఆహ్వానితుడు లడ్డు కేశవ్ పాత్ర, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కమ్యూనిటీ హాల్

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలం నందికొండ గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకి చేరుకుంది. కమ్యూనిటీ హాల్‌కి ఇరువైపులా చెట్లు పేరుకు పోవడంతో అక్కడ నివాసం చేస్తున్న ప్రజలు అటువైపుగా వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. నివాసం ఉంటున్న ప్రదేశంలో విష జంతువులు ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయని స్థానికుల భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు చొరవ తీసుకొని కమ్యూనిటీ హాల్‌ను పునర్నిర్మాణం చేపట్టి పేరుకుపోయిన చెట్లను తొలగించి విష జంతువుల నుంచి మా ప్రాణాలను రక్షించవలసిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉత్తర కోస్తా జిల్లాలకు వ్యవసాయ పరిశోధనలు పెరగాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్థానిక అంబేద్కర్ కళావేదికలో జరుగుతున్న ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండల సమావేశాలు రెండో రోజు కార్యక్రమం పలు పంటల్లో నాలుగు జిల్లాల్లో చేయవలసిన పరిశోధనల గురించి గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి మొదటిగా చర్చను ప్రధాన శాస్త్రవేత్తలు చెరకు, మెట్ట వ్యవసాయం, యాంత్రికరణ, ఉద్యాన, పంటను, ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్ర, అధిపతులతో విస్తరణ అంశాలు చర్చించారు. ఇందులో భాగంగా రానున్న తొలికరిలో వారిలో అధునాతన రకాలు ఎంటీయు-1239, ఎంటీయు-1318 ల తో పాటు నేరుగా విత్తేవరి విధానంలో యంత్రాలు లభ్యత ఫెర్టికం సీడ్రిల్ లు నాలుగు జిల్లాలలో పెరగాలన్నారు. వరి లో పొటాషియం వాడకము, జీవన ఎరువులు వాడకంతో పాటు చిరుధాన్యాలలో ప్రాసెసింగ్ యూనిట్లు పెరగాలని, పప్పు జాతి పంటలలో కొత్త రకాలు జీబీజీ-1, పెసరలో లాం పరిశోధన స్థానం రకాలను వాడాలన్నారు. నువ్వులలో నీటిని అందించే పద్ధతిలో స్ప్రింక్లర్లు వాడకంపై (సూక్ష్మ నీటు సాగుపై) పరిశోధనలు జరగాలన్నారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల బెట్ట పరిస్థితులకు తగ్గ రకాలను తొలకరి ఆరుతడి పంటల్లో ఎంచుకోవాలన్నారు. కార్యక్రమమం లో నాలుగు జిల్లాల శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.